
andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7, కనిష్ఠం 22.3

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్ జిల్లా వార్తలు

5

బుధవారం 6 మార్చి 2024

నేడు రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

నిజామాబాద్ అర్బన్, మార్చి 5: రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించి రైతులతో మాట్లాడనున్నారు. జిల్లాలోని బోధన్ నియోజకవర్గంలో ఎడపల్లి, నిజామాబాద్ రూరల్‌లో డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి, ఆర్మూర్ నియోజకవర్గంలో ఆర్మూర్ రైతువేదిక, బాల్కొండ నియోజకవర్గంలో ముప్కాల్ రైతు వేదికల్లో అధికారులు ఏర్పాటు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా రైతులతో మాట్లాడతారని జేడీఏ వాజిద్ హుస్సేన్ తెలిపారు.



కొలువు కోసం..



● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అభ్యర్థుల ప్రిపరేషన్

- రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ల జారీ
- ప్రభుత్వ ప్రకటనతో నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు
- పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు
- జిల్లా గ్రంథాలయానికి పెరుగుతున్న నిరుద్యోగులు



JOB

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి భారీగా నోటిఫికేషన్లను విడుదల చేయడంతో జిల్లాలోని నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. జాబ్ దక్కించుకునేందుకు ప్రణాళిక బద్ధంగా చదువుతూ ముందుకు సాగుతున్నారు. పోటాపోటీగా శిక్షణ తీసుకుంటున్నారు. నిరుద్యోగులు రేయింబవళ్లు కష్టపడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఎలాగైనా ఉద్యోగం సాధించాలని పట్టుదలతో ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని శిక్షణా సంస్థలు, గ్రంథలయాలు యువతతో కిక్కిరిసిపోతున్నాయి.

నిజామాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగల భర్తీకి నోటిఫికేషన్లు జారీచేయడంతో నిరుద్యోగులు వాటిపై దృష్టిపెట్టారు. గ్రూప్ 1, డీఎస్సీకి దరఖాస్తు చేస్తున్నారు. వీటితోపాటు బ్యాంకింగ్, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నిత్యం లైబ్రరీలు, ఇతర శిక్షణా సంస్థలను వినియోగించుకుంటూ ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ఎలాగైనా ఉద్యోగాలు సాధించాలని పట్టుదలతో సన్నద్ధమవుతు న్నారు.

గ్రూప్-1, డీఎస్సీకి నోటిఫికేషన్ల జారీ

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా గ్రూప్-1, డీఎస్సీకి నోటిఫికేషన్‌లను జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌లకు దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఉద్యోగాల పరీక్షల తేదీలను ప్రకటించింది. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్‌లు రాగానే జిల్లా నుంచి వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేశారు. పోలీసు కానిస్టేబుల్, ఎస్సై, గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4కు ప్రిపేర య్యారు. వీరితో పాటు ఇంజనీరింగ్ పోస్టులు, హార్టికల్చర్, నర్సింగ్, గురుకుల టీచర్ తోపాటు ఇతర పోస్టులకు సన్నద్ధమయ్యారు. జిల్లా నుంచి వందల సంఖ్యలో నిరుద్యోగులు ఉద్యోగాలను సాధించారు. మళ్లీ నోటిఫికేషన్లు విడుదలవుతుండడంతో ఉద్యోగాలు రాని ఎక్కువమంది దరఖాస్తు చేస్తున్నారు.

వేలాది మంది దరఖాస్తు

గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్‌లు ఒకేసారి ఇవ్వడం వల్ల వేలాది మంది ఉద్యో గాల కోసం దరఖాస్తు చేశారు. ఎక్కువ ఉద్యో గాలు రావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థకు తాకిడి బాగా పెరిగింది. ఆ సమయంలో గ్రంథాలయల్లో ఉన్న వసతులు సరిపోకపోవడంతో పక్కనే ఉన్న పాత డీఈవో కార్యాలయం, పెన్షనర్ల భవనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి నిరుద్యోగులు చదువుకునే విధంగా చూశారు. నగరంతో పాటు బోధన్, ఆర్మూర్, ఇతర ప్రాంతాల్లో కూడా ఏర్పాట్లను చేశారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో అప్పటి ఎమ్మెల్యేలు కూడా తమ పరిధిలో కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నిరుద్యోగులకు కావాల్సిన మెటీరియల్‌ను కూడా అందించి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఆ శిక్షణ ఉపయోగపడడం వల్ల కానిస్టేబుల్, ఎస్సై పోస్టులతోపాటు ఈ మధ్యనే ప్రభుత్వం ప్రకటించిన గురుకుల టీచర్ పోస్టులు ఇతర పోస్టులను ఎక్కువ మంది జిల్లాకు చెందిన వారు సాధించారు. ఇవేకాకుండా బ్యాంకింగ్, స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ జారీచేసిన ఉద్యోగాల్లో కూడా జిల్లాకు చెందిన వారు ఎంపికయ్యారు. గ్రంథాలయంలో సన్నద్ధమైన వారే ఎక్కువ మంది ఈ పోస్టులను సాధించారు.

గ్రంథాలయాల్లో ఏర్పాట్లు

గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు ఎక్కువగా చదివేందుకు గ్రంథాలయాల్లో కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. వీటితో పాటు సిస్టమ్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. వైఫై సౌకర్యాన్ని కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1, గ్రూప్-2 తోపాటు ఇతర పోటీ పరీక్షలకు కావాల్సిన మెటీరియల్‌ను అందుబాటులో ఉంచారు.

అందుబాటులో మెటీరియల్..

:మణిరత్నం (నిజామాబాద్)



పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ గ్రంథాలయంలో అందుబాటులో ఉంది. బ్యాంక్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. హైదరాబాద్‌కు వెళ్తే ఖర్చు ఎక్కువగా ఉండడంతో ఇక్కడి సదుపాయాలను ఉపయోగించుకుంటున్న. మెటీరియల్‌తో పాటు వైఫై ఉండడం వల్ల అవసరమైన సమాచారాన్ని తెలుసుకుంటున్నాం.

పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా..

: సంగేష్, (నవీపేట)



జేఈఈ పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాను. అన్ని పరీక్షలకు సంబంధించి పూర్తిస్థాయి మెటీరియల్ లైబ్రరీలో ఉండడంతో ఇక్కడికి వస్తున్నాను. ఎక్కువ మంది ప్రిపరేషన్‌కు వస్తుండడం వల్ల ముందుగా వస్తే తప్ప సీటు దొరకడం లేదు. పొద్దంతా ఇక్కడే ప్రిపరేషన్ కొనసాగిస్తున్నాం.

గ్రంథాలయాలకు తాకిడి

కేంద్ర, రాష్ట్ర నోటిఫికేషన్‌లు మళ్లీ రావడంతో గ్రంథాలయాలకు తాకిడి పెరిగింది. ఉదయం వచ్చే నిరుద్యోగులు మధ్యాహ్నం ఇక్కడే ఉంటూ సాయంత్రం 8గంటల తర్వాతే ఇంటికి వెళ్తున్నారు. గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం కూడా ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో సరఫరా అవుతుండడంతో ఎక్కువ మంది వినియోగించుకుంటున్నారు. రోజురోజుకూ నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రంథాలయ అధికారులు సరైన ఏర్పాట్లు చేస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా ఎస్సారెస్పీ ఆనకట్ట!



ప్రాజెక్టు అనకట్టపై మద్యం తాగి వదిలేసిన సీసాలు

- ప్రాజెక్టు కట్టపై నిత్యం మద్యం తాగుతున్న పోకిరీలు
- ఇబ్బంది పడుతున్న పర్యాటకులు, మత్స్యకారులు

మెండోర, మార్చి 5: లక్షలాది ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందిస్తూ తెలంగాణకే తలమానికంగా నిలిచిన ఎస్సారెస్పీ ఇప్పుడు పోకిరీలకు అడ్డగా మారింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి వచ్చే పర్యాటకులకు మందుబాబుల నుంచి కష్టాలు తప్పడం లేదు. తెలంగాణ జిల్లాల కల్పతరువు ఎస్సారెస్పీపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొందరు యువకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రాజెక్టుకట్టపై నిత్యం మద్యం తాగుతూ సీసాలను వదిలి వెళ్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కొందరు అక్కడ చేరి రోడ్డుపైనే మద్యం తాగుతూ నానా హంగామా సృష్టిస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో రోడ్డుపైనే తగిన సీసాలు పగులగొట్టి బీభత్సం సృష్టిస్తున్నారు. దీంతో ప్రాజెక్టు అందాలను తిలకించేందుకు వస్తున్న పర్యాటకులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రాజెక్టు రిజర్వాయర్‌లో చేపల వేటకు వేకువజామున వెళ్లే మత్స్యకారులకు మందు బాబులు పగులగొట్టిన సీసాలను తొక్కుతూ గాయాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టుపై మందు బాబుల ఆగడాలను సంబంధిత అధికారులు అరికట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

ఆరు గ్యారెంటీలను అర్హులకు అందించాలి

● ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశం





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్‌అర్బన్, మార్చి 5: అభయ హస్తం ఆరుగ్యారంటీల్లో భాగంగా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఎంపీడీవో, మున్సిపల్ వార్డు కార్యాలయాలల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవ కేంద్రాల ద్వారా అర్హుల వివరాలను ఆపరేటర్ల ద్వారా నిర్ణీత సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చి ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. ఈ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి విద్యుత్ శాఖ కార్యదర్శి రిజ్వీ, ఇతర రాష్ట్రస్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఆయా మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీసీ ద్వారా సమీక్షించారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెల్లరేషన్‌కార్డు వివరాలు, ఆధార్ కార్డు వివరాలు, గ్యాస్ కనెక్షన్ నంబరు, విద్యుత్ మీటర్ నంబర్ వివరాలు, లింకు ఉన్న దరఖాస్తుదారులకు ప్రభుత్వం 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాలను అమలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తులను అందించిన సమయంలో సరిగ్గా వివరాలు నమోదు చేయకపోయిన దరఖాస్తుదారులకు ఈ పథకాల ద్వారా లబ్ధి చూకూరాలని ఉద్దేశ్యంతో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈవీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, జడ్పీసీఈవో ఉషా, డిప్యూటీ సీఈవో సుందరవరదరాజన్, డీపీవో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సొమ్ము రికవరీ అయ్యేనా?





- నిజామాబాద్ సొసైటీలో రైతుల డబ్బు గాయబ్
- 30 మంది రైతుల సొమ్ము స్వాహా
- దొంగ రిసిప్టులతో రైతుల దృష్టి మళ్లింపు
- సొసైటీ కార్యదర్శి, సూపర్‌వైజర్ల చేతివాటం
- రూ.80 లక్షలు మాయమైనట్లు తేల్చిన డీసీవో
- రికవరీ చేయాలంటున్న రైతులు

నిజామాబాద్ రూరల్, మార్చి 5: జిల్లా కేంద్రంలోని కోటగల్లిలో ఉన్న నిజామాబాద్ ప్రాథమిక వ్యవసాయ కేంద్రం అక్రమాలకు నిలయంగా మారింది. స్వల్ప, దీర్ఘకాల రుణాలు తీసుకున్న రైతులు తమ అప్పులు తిరిగి చెల్లించిన సొమ్మును సొసైటీ సిబ్బంది మాయం చేశారు. రైతులకు దొంగ రసీదులిచ్చి వారిని మభ్యపెట్టారు. రైతుల రుణమాఫీ, కొత్త రుణాల మంజూరు వంటి కార్యక్రమాలు రావడంతో ఈ తతంగం బయటపడింది. తమ ఖాతాలో జమచేయమని రైతులు ఇచ్చిన డబ్బులను సొసైటీ కార్యదర్శి శివరామరాజు, సూపర్‌వైజర్ భాస్కర్‌లు రైతుల వద్ద నుంచి రకవరీచేశారు. వారికి తాత్కాలికంగా రశీదులు ఇచ్చి వారి ఖాతాలో జమచేశామని నమ్మబలికారు. రైతులు సొసైటీకి బాకీపడ్డ సొమ్ము చెల్లించాలని నోటీసులు ఇవ్వడంతో రైతులు అవాక్కయ్యారు. దాంతో రైతులు సొసైటీకి వచ్చి ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లను నిలదీశారు. వారు అప్పటి డీసీవోకు ఫిర్యాదుచేశారు. దాంతో అప్పటి డీసీవో సింహాచలం విచారణ కమిటీ వేసి నివేదిక ఇవ్వకుండా కాలం వెల్లదీశారు. కొత్త డీసీవోగా శ్రీనివాస్‌రావు రావడంతో విచారణ వేగవంతం చేశారు. చివరకు రైతులు చెల్లించాల్సిన డబ్బులు, తీసుకున్న రుణాలు, చెల్లించిన సొమ్మును ఆడిటర్‌లతో రికార్డులు చెక్ చేయగా మొత్తం రూ.80 లక్షల నిధులు దారిమళ్లినట్లు తెలిపారు. గతంలో సొసైటీలో కార్యదర్శిగా, సూపర్‌వైజర్‌లుగా విధులు నిర్వహించినవారు నిధులను దారిమళ్లించినట్లు నిర్ధారించారు. వారిపై ఫిర్యాదులు రావడంతో సస్పెండ్ చేశారు. రైతులు చెల్లించిన రుణాలను బ్యాంక్‌లో జమచేయకుండా తమ సొంతానికి వాడుకున్నట్లు అధికారులు నిర్ధారించారు. రెండేళ్ల క్రితం సొసైటీ నుంచి రైతులు రుణాలు పొందారు. వాటిని సకాలంలో అప్పటి సొసైటీ కార్యదర్శి శివరామరాజుకు చెల్లించారు. దానికి సంబంధించి రసీదులు కూడా తీసుకున్నారు. రైతులు సొసైటీకి బకాయిలు లేవని "నో డ్యూ సర్టిఫికెట్"లు కూడా పొందారు. రుణాలు మొత్తం చెల్లించినా కూడా ఆ రైతులకు సొసైటీ నుంచి బకాయిలు చెల్లించాలని నోటీసులు రావడంతో వారు అవాక్కయ్యారు. పలువురు రైతులు సొసైటీకి వచ్చి వారు చెల్లించిన సొమ్ముకు సంబంధించి రసీదులను సొసైటీ ఛైర్మన్ శేఖర్, వైస్ ఛైర్మన్ రవీందర్‌లకు చూపి ప్రశ్నిస్తున్నారు. తాము 2022లో అప్పటి సొసైటీ కార్యదర్శి శివరామరాజు, క్యాషియర్ భాస్కర్‌లకు డబ్బులు చెల్లించామని తెలిపారు. అందుకు సంబంధించి కట్టిన సొమ్ముకు రసీదులు, నో డ్యూస్ సర్టిఫికెట్‌లు కూడా చూపించారు. అయితే సిబ్బంది రైతుల వద్ద నుంచి వసూలు చేసిన డబ్బులు సొంతానికి వాడుకుని, రైతుల ఖాతాలో జమచేయలేదు. ఆన్‌లైన్‌లో సైతం రైతులు డ్యూ ఉన్నట్లు చూపిస్తున్నాయి. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ అమలు కాకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నేడు మహాజన సభ..

నిజామాబాద్ సొసైటీ మహాజన సభ బుధవారం కోటగల్లిలోని కార్యాలయంలో జరగనుంది. ఈ మహాజన సభకు రైతులతోపాటు సొసైటీ ఛైర్మన్ శేఖర్, వైస్ ఛైర్మన్ రవీందర్ రెడ్డితోపాటు డీసీవో శ్రీనివాసరావు కూడా హాజరుకానున్నారు. ఈ మహాజన సభలో రైతుల నుంచి తీసుకున్న సొమ్ము రికవరీ గురించి రైతులు ప్రశ్నించనున్నారు.

మోసపోయిన రైతులు

సొసైటీ పరిధిలోని గూపన్‌పల్లి, కోటగల్లి, అర్సపల్లి, కేశాపూర్, ముబారక్‌నగర్‌లకు చెందిన రైతులు మోసపోయినవారిలో ఉన్నారు. వారిలో బండారిబల్వాన్ అనే రైతు సొసైటీకి రూ.1,06,000, రెడ్డి సుజాత అనే మహిళా రైతు రూ.1,11,158, గోపరి లింగన్న అనే కంఠేశ్వర్ రైతు రూ. 1,06,000 గూపన్‌పల్లి రైతు కర్రోల్ల శ్రీనివాస్ రూ. లక్ష, గూపన్‌పల్లికి చెందిన మరో రైతు కర్రోళ్ల సాయిచందర్ రూ. 1,05,000 కూడా చెల్లించినట్లు తెలిపారు.

డబ్బులు చెల్లించినా.. జమచేయలేదు

: బండారి బల్వాన్, రైతు

నేను సొసైటీ ద్వారా స్వల్పకాల రునాలు తీసుకున్నాను. సొసైటీ సిబ్బందికి రూ. లక్ష 6 వేలు తిరిగి చెల్లించాను. అయినా నేను బాకీ పడ్డట్లు నాకు నోటీసులు పంపారు. నాలాగే పదుల సంఖ్యలో రైతులు మోసపోయారు. రైతుల నుంచి తీసుకున్న సొమ్మును వెంటనే రికవరీ చేయాలి.

నిధుల గోల్‌మాల్‌పై డీసీవోకు ఫిర్యాదు చేశాం..

: శేఖర్, సొసైటీ ఛైర్మన్


గత సొసైటీ ఛైర్మన్ హయాంలో నిధుల గోల్‌మాల్ అయినవి. రైతుల ఫిర్యాదుతో డీసీవోకు ఫిర్యాదు చేశాం. ఎంక్వైరీ కూడా జరిగింది. నివేదిక ఇంకా ఇవ్వలేదు. నిధుల గోల్‌మాల్‌కు పాల్పడిన సిబ్బంది నుంచి సొమ్ము రికవరీ చేయాలి.

నిధుల అవకతవకలపై నివేదిక వచ్చింది..

: శ్రీనివాస్‌రావు, డీసీవో

నిజామాబాద్ సొసైటీలో రైతుల డబ్బులను వారి ఖాతాల్లో జమచేయలేదని ఫిర్యాదులు వచ్చాయి. రైతులు, సొసైటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు ఫిర్యాదు చేశారు. రూ.80 లక్షల నిధులు గోల్‌మాల్ జరిగినట్లు తెలిసింది. పూర్తి నివేదిక ఉన్నతాధికారులకు సమర్పిస్తాం.

జిల్లాలో కొనసాగుతున్న రైతుబంధు



● 2లక్షల 20వేల 36మంది రైతుల ఖాతాల్లో డబ్బులు జమ

నిజామాబాద్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతుబంధు అమలు కొనసాగుతోంది. కొత్త ప్రభుత్వం రాగానే రైతుల కోసం నెలన్నర క్రితం ప్రారంభించగా ప్రతిరోజూ కొంతమంది రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులను జమ చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం నాలుగు ఎకరాలున్న రైతుల ఖాతాలో ఈ డబ్బులను జమ చేస్తున్నారు. ఈనెల 20లోపు మొత్తం రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమకానున్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధును ఈ ప్రభుత్వం కూడా రైతుభరోసా కింద కొనసాగిస్తోంది. ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో ట్రెజరీ ద్వారా ఈ డబ్బులను జమచేస్తున్నారు. జిల్లాలో మొదట ఎకరంలోపు ఉన్న రైతుల ఖాతాల్లో రైతుబంధును జమచేశారు. ఎకరం పూర్తయిన తర్వాత రెండు ఎకరాల రైతుల ఖాతాల్లో వేశారు. ఒక్కొక్క ఎకరం పెంచుకుంటూ ఈ డబ్బులను జమచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 2లక్షల 89వేల 293మంది రైతులు ఉన్నారు. వీరిలో 2లక్షల 60వేల 526మంది రైతులకు సంబంధించిన వివరాలు ట్రెజరీలో నమోదయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకు 2లక్షల 20వేల 36మంది రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేశారు. జిల్లాలో రైతుబంధు కింద మొత్తం 260.56కోట్లు జమకావాల్సి ఉండగా ఇప్పటి వరకు 145.66 కోట్లు జమ అయ్యాయి. విడతల వారీగా రైతుల ఖాతాల్లో ప్రతిరోజూ ఈ డబ్బులను జమ చేస్తున్నారు. ఒకటి రెండ్రోజుల్లో నాలుగెకరాలు ఉన్న రైతుల ఖాతాల్లో డబ్బులు వేయడం పూర్తిచేసి ఐదెకరాలు ఉన్న రైతులకు రైతుబంధును జమచేయనున్నారు. ఈనెల 20లోపు మొత్తం రైతులకు అందించే విధంగా ఏర్పాట్లు చేశారు.



వాగులో నుంచి ఇసుకను తీస్తున్న దృశ్యం

పేరుకే ప్రభుత్వ పాయింట్..

ఇసుక వ్యాపారులదే ఆధిపత్యం!

● ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి

మోర్తాడ్, మార్చి 5: మండలంలోని సుంకెట్ గ్రామ శివారులోని పెద్ద వాగు నుంచి ఇసుక తీసేందుకు అధికారులు ప్రభుత్వ పాయింట్‌ను ఏర్పాటు చేసినా, వాగుపై ఇసుక వ్యాపారుల పెత్తనం జరుగుతున్నది. గ్రామాలలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్న వారు తహసీల్ కార్యాలయం నుంచి అవసరం వున్న వేబిల్లులు తీసుకున్నా.. సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకునే వీలులేదు. యజమానులు తీసుకున్న వేబిల్లులు ఇసుక వ్యాపారులకు ఇవ్వాల్సిందే. లేదంటే వేరే ట్రాక్టర్లను అనుమతించరు. వేబిల్లులు వున్న లబ్ధిదారులు.. వారు చెప్పిన ధరనే చెల్లించాలి. అంతేకాక గ్రామాలలో ఇళ్లు కట్టుకునే వారికి అవసరం ఉన్న ఇసుక కంటే ఎక్కువ ట్రిప్పులు అవసరం అని వారితో రాయించుకుంటారు. ఇటీవల ఆర్మూర్ వైపు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లను వేల్పూర్ పోలీసులు తనిఖీ చేస్తే.. తప్పుడు వేబిల్లులతో అక్రమంగా ఇసుక సరఫరా చేస్తున్నారని గుర్తించారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తే జరిమానా చెల్లించి విడిపించుకున్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వేబిల్లులు తీసుకున్న వారు సొంతంగా ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకునే సౌకర్యం కల్పించాలని, ఇసుక పాయింట్‌పై అధికారులు గట్టి నిఘా పెట్టి దొంగ వేబిల్లుల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై వుంది.

● ఇసుకను తరలించేందుకు వేబిల్లులు రెన్యూవల్ చేశాం

: సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

సుంకెట్ ఇసుక పాయింట్ వద్ద నిజమైన గృహ నిర్మాణదారులకే వేబిల్లులు ఇస్తున్నాం. ఇసుక పాయింట్ వద్ద రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను ఏర్పాటు చేశాం. సోమవారం ఇసుకను తరలించేందుకు 260 వేబిల్లులు గృహ నిర్మాణాలకు, పది ప్రభుత్వ పనులకు, నాలుగు వేబిల్లులను రిన్యూవల్ చేశామన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటాం.



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ఆర్మూర్ రూరల్, మార్చి 5: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొనే జూనియర్ బాలుర జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. పెర్కిట్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించి జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, ప్రధానకార్యదర్శి సురేందర్ తెలిపారు. వీరు ఈనెల 8 నుంచి వరంగల్‌లో జరగనున్న 45వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర పోటీలలో పాల్గొంటారన్నారు. ఇందులో కోశాధికారి గరడి రాజేష్, పాఠశాల డైరెక్టర్ జవహర్, సదామస్తుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.


భక్తుల కొంగు బంగారం.. పడిలేచిన మర్రిచెట్టు

- పడిలేచిన మర్రిచెట్టు శివసాయి దేవస్థానంగా పిలుస్తారు
- ఆలయ ఆవరణలో కొలువైన సాయిబాబా, హన్మాన్ ఆలయాలు
- దాతల సాయంతో 36 అడుగుల హన్మాన్ విగ్రహం, కల్యాణ మండప నిర్మాణం
- ముడుపులు కడితే కోరికలు తీర్చే మర్రిచెట్టు మహిమ

ముప్కాల్, మార్చి 5: మండల కేంద్రంలో మర్రి వృక్షం సుమారు 200ఏళ్ల క్రితం ఉన్న ఈ (పడిలేచిన మర్రిచెట్టు) శ్రీమహాలింగేశ్వర స్వామి వటవృక్షం గత 18ఏళ్ల క్రితం 2005జనవరి 28వ తేదీన అనాటి పరిణామాల దృష్ట్యా భారీ ఈదురుగాలులకు అకస్మాత్తుగా నేలకొరిగింది. 33అడుగుల వృత్త విస్తీర్ణం ఉన్న ఈ మర్రి చెట్టు వక్షరాజం కుకటివేళ్లతో సహా పడిపోవడం జరిగింది. అనంతరం అదే సంవత్సరం 2005జూన్ 24వ తేదీ శుక్రవారం రోజు ఎలాంటి మానవ ప్రయత్నం లేకుండానే యధాస్థానంలో పునర్ ప్రతిష్ఠమై లేచి నిలబడిందని గ్రామస్థులు పేర్కొన్నారు.

● పడిలేచిన మర్రిచెట్టుకు భక్తుల పూజలు

అనాటి నుంచి నేటి వరకు చుట్టు ప్రాంతాల నుంచి కాకుండా ఇతర జిల్లాల నుంచి పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పడిలేచిన మర్రి చెట్టు మహాలింగేశ్వర స్వామి వారిని దర్శించుకొని ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకుంటున్నారు. అంతేకాకుండా మొక్కులు తీరిన భక్తులు కుటుంబ సమేతంగా సోమవారం వచ్చి వారు కట్టిన ముడుపులు తీసి



ముస్తాబైన కొత్తపల్లి రాజారాజేశ్వరాలయం

నేటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

ముప్కాల్ మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద, కొత్తపల్లి గ్రామంలో రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ విశేష పూజలు జరిగాయి. ఉత్సవాల్లో రెండవ రోజు ఆలయంలో ఉదయం వేకువ జామున ప్రతిష్ఠ మూర్తులకు పంచామృతాలతో వేదమంత్రాలతో అభిషేకం చేసి వివిధ రకాల పూవ్వుల బిల్వ పత్రాతో అలంకరించి రుద్ర హోమం, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

● మహా శివరాత్రికి ప్రత్యేక పూజలు

మహా శివరాత్రి పర్వదినాన సందర్భంగా శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, 11.21 నిమిషాలకు శివపార్వతుల కల్యాణం, శివరాత్రి జాగరణ, భజన కార్యక్రమాలు, జగరణలు జరుగుతాయి. రాత్రి లింగోద్భవ కాలంలో బిల్వ అభిషేకం చేయనున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని రంగులతో, వివిధ రంగుల పూలతో, విద్యుద్‌దీపాలతో అలంకరిచారు. అంతేకాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లు, నీటి వసతులు పార్కింగ్ వసతులు అన్ని ఏర్పాటు చేశారు. స్థానిక ఆలయ పూజరుల ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ, దేవాదాయ కమిటీ సభ్యులు తెలిపారు.

సత్యనారాయణ వ్రతం చేసి సామూహిక భోజనాలు చేసి.. స్వామి వారిని దర్శించుకొని భక్తులు వెళ్తుంటారు.

● ప్రతీ సోమవారం పండుగ వాతావరణం

ప్రతీ సోమవారం పడి లేచిన మర్రి చెట్టు ఆలయం వద్ద పండగ వాతావరణం నెలకొంటుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాకుండా ఇతర మండలాల నుంచి కూడా ఎంతో మంది భక్తులు వారి కుటుంబసమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీ దృష్ట్యా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి రోజు రోజుకు పెరుగుతున్న భక్తులకు అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ అద్భుత స్థలామైన మహాలింగేశ్వరస్వామి పడి లేచిన మర్రిచెట్టు ప్రతీరోజు భక్తులు పూజలు అందుకుంటుందని పూజరులు అంటున్నారు. ప్రతీ గురువారం సాయిబాబా హారతి తర్వాతి అన్నదానం చేపడతారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించిన శివరాత్రికి మూడు రోజుల ముందు అరు నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. గ్రామంలోని యువకులు పెద్దలు దాదాపు 20నుంచి 40మంది 41రోజుల పాటు శివదీక్షలు తీసుకుని స్వాములు ఆలయం ఆవరణలో ఉంటారు. శివరాత్రి పర్వదిన రాత్రి జాగరం చేసి మరుసటి రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాల తీసి దీక్ష విరమిస్తారు. శివరాత్రి నిలరం ఉన్న భక్తులు మరుసటి రోజు మహా అన్నదానం ఒక్కపొద్దులు విరుమిస్తారు. పడిలేచిన మర్రిచెట్టు పక్కన సాయిబాబా ఆలయం పక్కన 36 అడుగుల భారీ ఆంజనేయస్వామి విగ్రహం కొలువైంది. ఈ విగ్రహదాత నునుగొండ అంజయ్య నునుగొండ శ్యామల జ్ఞాపకార్థం (శాయమల కల్యాణ మండపం)ను నిర్మించారు. మహాలింగేశ్వరస్వామి చుట్టు పక్కల భక్తులకు ఇబ్బందుల తలెత్తకుండా దర్మశాల, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్ స్థలం కూడా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



జాతరకు ముస్తాబైన పడిలేచిన మర్రి చెట్టు ఆలయం

తెలంగాణ విశ్వవిద్యాలయంలో జాతీయ సదస్సు



హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

డిచ్‌పల్లి, మార్చి 5: తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ మరియు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు భారతీయ భాష సంస్థ మైసురు వారి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు లక్షణ గ్రంథాలు -సమాలోచన అనే అంశం పై రెండు రోజుల పాటు జాతీయ సదస్సులో భాగంగా మంగళవారం టీయూలో సభాధ్యక్షుడు, తెలుగు అధ్యాయన శాఖ అధ్యక్షుడు లక్ష్మణ చక్రవర్తి అధ్యక్షతలో ప్రారంభోపన్యాసం ప్రాజెక్టు డైరెక్టర్ తెలుగు విశిష్ఠ అధ్యాయన కేంద్రం నెల్లూరు ఆచార్య మాడభూషి సంపత్ ప్రసంగించారు. శాస్త్ర గంథాలను చదవడం మూలంగా మన ప్రాచీనులు మనకందించిన శాస్త్రీయ అంశాలు తెలుసుకునేందుకు ఆవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి హాజరై మాట్లాడుతూ.. ఇలాంటి సాహిత్యంపై ఇంకా పరిశోధనలు జరగాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ప్రొ.కనకయ్య, సాగి కమలకర శర్మ, సూర్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పనుల చోట ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి : ఎంపీడీవో

కమ్మర్‌పల్లి, మార్చి 5: పనులు జరుగతున్న చోట ఉపాది కూలీలకు గ్రామపంచాయితి నుండి నీడ నిమిత్తం టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్ల లాంటి తదితర సదుపాయాలు కల్పించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజ శ్రీనివాస్ అదేశించారు. మంగళవారం మండంలోని హసాకొత్తూర్, చౌట్‌పల్లి గ్రామశివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పథకం పనులను క్షేత్రస్థాయిలో ఆయన సందర్శించి పరిశిలించారు. తక్కువ కూలీలు పనికిరావడం పట్ల కారణాలను ఆయన అరాతీశారు. ప్రతీరోజు కనిసం వందమంది కూలీలు హాజరయ్యోలా చర్యలు తీసుకోవాలని స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయితి కార్యదర్శి ఆదేశించారు. ఆయితే మస్టర్‌లో పేర్లు ఉన్న కూలీలు మాత్రమే క్షేత్రస్థాలో ఉపాది పనులకు హాజరు కావాలని సూచించారు. పేర్లు లేనివారు హాజరు కాకుండా చూసుకోవాలని ఒకరిపేర ఒకరువస్తే ఏదేని అనుకోని ప్రమాదాలు జరిగితే లేని సమస్యలు ఎదురవుతాయని సూచించారు. పనులు జరుతున్న చోట ఏలాంటి ప్రమాదాలు జరుగకుండ కూలీలకు అవగాహన కల్పించాలని, ఏవిషయమైన తక్షన సమాచారం అందివ్వాలన్నారు. అయన వెంట ఐజీఎస్ ఏపీవో విద్యానంద్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు హరీష్, సాదుల్ల, టీఏలు, సీనియర్ మేట్‌లు ఉన్నారు.

ఎల్‌ఆర్ఎస్‌పై పోరుబాట : ఎమ్మెల్యే

ముప్కాల్, మార్చి 5: రాష్ట్రంలో రూ.25లక్షల మంది ఎల్‌ఆర్ఎస్ లబ్ధిదారుల ప్రజలపై సుమారు రూ.20వేల కోట్ల ఆర్థిక బారాన్ని మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గంలో చేపట్టే నిరసన ధర్నాను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణలకు, ప్రజలకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10గంటలకు బాల్కొండ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జరిగే ధర్నాకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ఎల్‌ఆరెస్ లబ్ధిదారులు పెద్ద ఎత్తున హాజరుకావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

'ప్రతీ ఇంటికీ కాంగ్రెస్ ఆరు గ్యారంటీ స్కీంలను చేరవేరుస్తాం'

భీమ్‌గల్ రూరల్, మార్చి 5: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా 200 ల యూనిట్ ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు వంటగ్యాస్ గ్యారంటీలను సిఎం రేవంత్ రెడ్డి నెరవేర్చారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొదిరెస్వామి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రతి ఇంటికి చేరవేరుస్తామని అన్నారు. మంగళవారం భీమ్‌గల్ పట్టణంలో సిఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యకమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్లూరి శ్రీనివాస్, చరణ్, నర్సయ్య, సాగర్ తదితరులు పాల్గోన్నారు.

ముప్కాల్‌లో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

ముప్కాల్, మార్చి5: జాతీయస్థాయి సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు తాము తయారు చేసిన పనికరాలను ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ఈ సైన్స్ ప్రదర్శనలో రోబోను రూపొందించి ప్రదర్శించడం పట్ల ఆందరిని చూపరులను ఆకట్టుకుంది. అదే విధంగా సైన్స్‌కు సంబంధించిన చిత్రలను ముగ్గుల ద్వారా వేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. అదేవిధంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు గంగారాం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, కనకద్రి, నరేష్, బాలగంగాధర్, నరేందర్, నవీన్, అజ్మత్, రవి, సునీత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా కంప్యూటీకరణ చేయాలి'

డిచ్‌పల్లి, మార్చి 5: డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ప్రజాపాలన ధరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించి రేషన్ నంబర్లు, ఆధార్ నెంబర్లు సరి చేసి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ వర్తించేఆ కంప్యూటర్ ఆపరేటర్ లు తగిన చొరవ చూపాలని ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ లను ఆదేశించారు. కంప్యూటరీకరణ చేస్తున్న ప్రతి వివరాలను ధరఖాస్తులు కలెక్టర్ కార్యాలయానికి చేరేల చూడలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కౌటింగ్ కోసం సీఎంసీ కళాశాల ను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చేపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్

ఆర్మూర్ రూరల్, మార్చి5: ఆర్మూర్ మండలం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన నిమిత్తం మాక్ పోలింగ్ నిర్వహించారు.ఇందులో భాగంగా నామినేషన్‌ల స్వీకరణ, పరిశీలన , ఉపసంహరణ తుది అభ్యర్థుల జాబిత ప్రకటన గుర్తులు కేటాయించి తదితర వాటిపై అవగాహణ కల్పించారు. రిటర్నింగ్ ఆఫీసర్‌గా లహరి, ప్రొసైడింగ్ ఆఫీసర్‌లుగా సన్నిహిత, పోలింగ్ ఆఫీసర్‌గా రిశ్విత వ్యవహరించి ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్, విజేతకు గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేత, తదితర వివరించారు. హెచ్‌ఎం చేతనకుమారి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఉపాధ్యాయురాలికి అవార్డు

కమ్మర్‌పల్లి, మార్చి 5: మండంలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు గంగమణికి మహిళ ఉద్యోగ అవార్డు దక్కింది. విద్యార్థులకు ఉత్తమ పద్దతిలో విద్యాబోనకు ఈ అవార్డు వరించినట్లు హెచ్ ఎం గంగాధర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళదినోత్సవాన్ని పుస్కరించుకుని జిల్లాకేంద్రంలో జరిగిన కార్య క్రమంలో అవార్డును గంగామణి అందుకోగా మంగళవారం స్థానిక పాఠశాలలో గంగామణిని గ్రామ మాజీ సర్పంచ్ సక్కరం అశోక్ పాఠశాల హెచ్‌ఎం గంగాధర్, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆర్మూర్ టౌన్ మార్చి 5: మండలంలోని పిప్రి గ్రామశివారులో ట్రాక్టర్ ట్రాలీ ఢీకొని మంథని గ్రామానికి చెందిన శ్రావణ్‌గౌడ్(27) మృతి చెందాడు. నెల రోజుల క్రితం అమెరికా నుంచి వచ్చిన శ్రావణ్‌గౌడ్ ఫ్రెండ్స్‌తో కలిసి ఆర్మూర్ నుంచి మంథని గ్రామానికి ద్విచక్ర వాహనం పై వెళ్తుండగా పిప్రి గ్రామశివారులో ఆగివున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని మృతి చెందాడు. మృతునితో పాటు మరోకరి తీవ్రగాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఈనెల 12న అమెరికాకు వెళ్ళాల్సిన శ్రావణ్‌గౌడ్ అనంతలోకాలకు వెళ్ళడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్ , మార్చి5: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సోమవారం రాత్రి బూక్య కమల(65) అనే వృద్దురాలు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని శాస్త్రీనగర్‌లో కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న బుక్య కమల ఇంట్లో ఎవరు లేని సమయంలో దులానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని ఎస్సై అశోక్ పరిశీలించి మృతదేహాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



ఉప్లూర్‌లో స్వామివారి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఉప్లూర్‌లో బాలరాజరాజేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం

కమ్మర్‌పల్లి, మార్చి 5: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి జాతరా ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ నిర్వహన కమిటి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రమేష్ తెలిపారు. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభకాగా శుక్రవారం వరకు ప్రతిరోజు స్వామివారి పల్లకి ఊరేగింపు, ప్రత్యేక పూజాకార్యక్రమమాలు తీర్థప్రసాదాలు ఉంటాయని శివరాత్రి రోజు స్వామివారి పల్లకీ ఊరేగింపు జాతరా ఉంటుందని అర్చకుడు పవన్‌శర్మ తెలిపారు. రెండవరోజు మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి బాలరాజరాజేశ్వర స్వామివారి పల్లకిని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు దర్శిచుకున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం

కామారెడ్డి టౌన్, మార్చి 5:కామారెడ్డి పట్టణంలోని గొల్లవాడ యాదవ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ కళ్యాణోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఉరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అమ్మవారి ఆలయం ముందు పట్నాలు పరిచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరికలు తీర్చాలంటూ ఆలయం చుట్టు ప్రదక్షణలు చేస్తు అమ్మవారికి ఓడిబియ్యం పోసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఆధునిక సాంకేతిక విధానాలపై అవగాహన

మద్నూర్, మార్చి 5: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మద్నూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ దృశ్య శ్రవణ విధానం ద్వారా ఆధునీక సాంకేతిక విధానాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 11.30 గంటలకు సీఎం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు.

రామడ్గు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం

ధర్పల్లి మార్చి 5: మండలంలోని రామడ్గు సింగిల్‌విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మాణాన్ని ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో గల డీసీవో కార్యాలయంలో డీసీవో శ్రీనివాస్‌రావుకు అవిశ్వాస తీర్మాణ పత్రాన్ని అందజేశారు. సింగిల్‌విండో పరిధిలో గల ఏడుగురు డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మాణానికి మద్దతు తెలిపారు. అవిశ్వాస తీర్మాణంపై ఓటింగ్ త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు. కాగా అవిశ్వాస తీర్మాణం పెట్టిన ఏడుగురు డైరెక్టర్‌లు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఆలూర్‌లో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌రూరల్, మార్చి 5: మండల కేంద్రంలో డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం తహసీల్దార్ నరేష్, ఈవో రాజలింగం భూమిపూజ చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.6లక్షలతో డ్రైనేజీ నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు నడీసరం మల్లయ్య, కార్యదర్శి హరిష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి 10మంది సొసైటీ చైర్మన్‌లు

డిచ్‌పల్లి, మార్చి 5: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పలువురు సోసైటీ చైర్మన్‌లు బీఆర్ఎస్ పార్టీనుంచి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువలు కప్పి స్వాగతించారు. మెంట్రాజ్‌పల్లి, ముత్తకుంట, గుండారం, బోర్గాం, అర్గుల్, మాధవనగర్, బర్దిపూర్, బాడ్సి, కొలిప్యాక, పాల్దా, సొసైటీ చైర్మన్‌లు పార్టీలో చేరారు.



కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ చైర్మన్‌లు

అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, మార్చి 5: అధికారులు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎరాజ్ ఎల్లి గ్రామంలో రూ. 30 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రానికి, సొసైటీ గోదాం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ఆరుగ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. సాలూర గ్రామస్థులు 45 మంది కాంగ్రెస్‌లో చేరడంతో వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్, జడ్పీటీసీ లక్ష్మీ గిర్దావర్ గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..

నవీపేట: విధి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తడగామలో జరిగిన గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు జీరో బిల్లులు అందించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ విషయంలో ఎవరైనా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ నెల 1నుంచి 9వ తేదీ వరకు గతంలో రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నవీపేట మండలంలో గృహజ్యోతి పథకం కింద 15వేల మంది అర్హులైన కుటుంబాలు ఉండగా కేవలం 8వేల కుటుంబాలకే అర్హత లభించిందని, మిగిలిన వారికి సైతం వెంటనే లబ్ధిచేకూర్చే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ రావు, ఏడీఈ సుహాసిని పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ముందుంటుంది..

రెంజల్: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఎల్లప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి మీటర్ రీడింగ్ తీసి జీరో బిల్లును లబ్ధిదారులకు అందజేసి గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కనుమరుగు

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

● కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సొసైటీ చైర్మన్లు,వైస్ చైర్మన్లు

మోపాల్, మార్చి 5: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ చైర్మన్లు పది మందితో పాటు వైస్‌చైర్మన్లు, డైరక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన డీసీసీబి డైరక్టర్ బోర్గాంపి సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, నాగేశ్వర్‌రావ్, మోహన్‌రెడ్డితో పాటు ఆయా మండలాలకు చెందిన చైర్మన్లు, వైస్‌చైర్మన్లు రాజకిషన్, డైరక్టర్లు చేరిన వారిలో ఉన్నారు. పార్టీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్‌లో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరు మిగలరని అన్నారు. నియోజకవర్గంలో 22మంది సొసైటీ చైర్మన్లు ఉంటే ఇప్పటికి పది నుంచి పద్దేనిమిది మంది కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు సంబంధించిన సబ్సీడీలను ఎత్తివేసిందని మండిపడ్డారు. రైతుబంధు పేరుమీద అనేక మోసాలు జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పంటపండించే రైతులకు న్యాయం చేసేందుకు తగు చర్యలు తీసుకుంటుందని అన్నారు. రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హాయంలో బడా రైతులకున్యాయం జరిగిందే తప్ప సన్న, చిన్న కారు రైతులకు న్యాయం జరుగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో రైతు పంటకు భీమా అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారురైతులకు రెండులక్షల రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బ్యాంకు అధికారులతో మాట్లాడడం జరుగుతుందని తెలిపారు. బీజేపీ పార్టీ రైతులకు చేసిందేమి లేదని అన్నారు. రైతుల న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేస్తే బీజేపీ ప్రభుత్వం ఢిల్లీలో కాల్పులు జరిపారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ వచ్చిన ఆయన గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌గౌడ్, మునిపల్లిసాయరెడ్డి, ముప్పాగంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, భోజన్న, ఆదే ప్రవీణ్‌కుమార్, సంతోష్‌రెడ్డి, తారచంద్, అమృతపూర్ గంగాధర్, సతీష్‌రెడ్డి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన తాడ్‌బిలోలి ఎంపీటీసీ సభ్యుడు

రెంజల్, మార్చి 5: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి లింగారెడ్డి మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ్, మాజీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి, రాములు, నాయకులు పోచయ్య, నితిన్, జావీద్, సురేష్ పటేల్, శ్రీనివాస్, కార్తీక్ ఉన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్ గౌడ్ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యానికి గురి కావడంతో మంగళవారం ఆయనను తన స్వగృహంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన చికిత్సను అందించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఆయన తెలిపారు. ఆయన వెంట మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, సాయిబాబాగౌడ్, సాయగౌడ్, శ్రీనివాస్, నితిన్, తదితరులున్నారు.

అనాథ ఆశ్రమానికి బ్యాటరీ విరాళం

కోటగిరి, మార్చి 5: మండల కేంద్రంలోని అమ్మ వికలాంగుల అనాథ ఆశ్రమానికి మంగళవారం ఇన్వెటర్ బ్యాటరీని విరాళంగా అందించారు. కోటగిరికి చెందిన తాటి రాములు మనవళ్ల సాయిరాం, సంతోష్‌లు అనాథ ఆశ్రమానికి తనవంతు సాయంగా ఇన్వెటర్ బ్యాటరీని అందజేశారు. అనాథ ఆశ్రమంలో చదువుతున్న బాలబాలికలు మిలటరీలో ఉద్యోగాలు సాధించడం హర్షనీయమని తాటి సత్యానారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరూప, ఆశ్రమ నిర్వాహకురాలు వెంకట రమణమ్మ, సాధన, ఆర్మీ జవాన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవీపేటలో వాహనాల తనిఖీ

నవీపేట,మార్చి5: మండల కేంద్రంలోని బాసర రోడ్డులో మంగళవారం సాయంత్రం ఎస్ఐ యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమాన విధించడం జరిగిందని ఎ స్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీరో బిల్లుల పంపిణీ

ఆర్మూర్‌టౌన్, మార్చి 5: మున్సిపల్ పరిధిలోని 12, 13, 30 వార్డుల లో కాంగ్రెస్ బీసీసెల్ అధ్యక్షుడు దొండి రమణ జీరో బిల్లులను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను గృహజ్యోతి పథకంపై అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పింజ అభినవ్, తోపారం భగత్, కన్నం లక్ష్మణ్, గుంజాల సుమన్, పసుపుల నరేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి'కి దరఖాస్తుల అందజేత

ఆర్మూర్‌టౌన్, మార్చి 5: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గృహజ్యోతి పథకం వర్తించేలా చూడాలని మంగళవారం లబ్ధిదారులు దరఖాస్తులను అందజేశారు. ఇటీవల పలువురికి గృహజ్యోతి పథకంలో జీరో బిల్లు రాకుండా బిల్లు రావడంతో అవాక్కయ్యారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను అందజేసి ఇదే నెల నుంచి గృహజ్యోతి పథకం అమలు అయ్యేలా చూడాలని అధికారులను వేడుకున్నారు.

విద్యార్థి హత్య ఘటనలో ఏడుగురిపై కేసు

బోధన్ రూరల్, మార్చి 5: బోధన్ బీసీ వసతి గృహంలో జరిగిన దారుణ ఘటనలో ఆదివారం రాత్రి డిగ్రీ విద్యార్థి వెంకట్ హత్యకు గురయ్యారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో విచారించి ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం బోధన్ సీఐ వీరయ్య తెలిపారు. నలుగురు విద్యార్థులను కోర్టు రిమాండుకు తరలించి మరో ముగ్గురు విద్యార్థులను జువేనల్ హోమ్‌కు తరలించామని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి హాస్టల్ వార్డెన్ స్వామి, నైట్ వాచ్‌మెన్ గంగాధర్‌లు సస్పెండ్ అయినట్లు అధికారులు తెలిపారు.

మొబైల్ షాపులో చోరీ

ఖిల్లా, మార్చి 5: జిల్లా కేంద్రంలోని పోలీసు కమిషనరేట్ క్యాంపు కార్యాలయానికి సమీపంలో గల ఓ మొబైల్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి అందులో నుంచి నగదుతో పాటు పలు విలువైన సెల్‌ఫోన్లను అపహరించిన ఘటన మంగళవారం ఉదయం వెలుగు చూసింది. మొబైల్‌షాప్ వెనక భాగాన గల గోడకు కన్నం వేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు. నగరంలోని ఒకటోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని తిలక్‌గార్డెన్ మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీవెంకటేశ్వర మొబైల్ షాప్‌లో ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు రాత్రి వెనక వైపున ఉన్న గోడకు కన్నం వేసి లోనికి చొరబడ్డారు. అందులో గల సెల్‌ఫోన్లు, నగదును అపహరించారు. గతంలో కూడా ఈ షాపులో దొంగతనానికి యత్నించిన దుండగులు అందులోని సీసీ ఫుటేజ్‌లో కనిపించారు. దుండగులు పట్టుబడకుండా ఉండేందుకు సీసీ కెమరాలకు సంబంధించిన వైర్లను కత్తిరించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. దుండగుల కోసం సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఒకరి అరెస్ట్

ఖిల్లా, మార్చి 5: నగరంలో పలు ఏటీఎంలలో డబ్బులు తీయడానికి వచ్చిన వారి ఏటీఎం కార్డును మార్చి చోరీకి పాల్పడే వ్యక్తిని ఒకటో టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయన వద్ద నుంచి సుమారు రూ.30వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. నగరంతో పాటు జిల్లాలోని పలు ఏటీఎం కేంద్రాల వద్ద అమాయక ప్రజలను మోసంచేసి వారి ఏటీఎం మార్చి తర్వాత డబ్బులను డ్రా చేసుకుని మోసం చేస్తున్న కామారెడ్డి జిల్లా బిక్కనూర్ మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన గద్దమిది రమేష్ అలియాస్ రాజును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నగరంలోని ఒకటో టౌన్‌లోనే మూడు చోట్ల చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది.

ధర్మపురి అర్వింద్ కాషాయపు కసాయి

● ఎంపీగా ఆయనకంటే డేరాబాబా, నిత్యానందే మిన్న

● బీజేపీ నేత మీసాల శ్రీనివాస్‌రావు

న్యూఢిల్లీ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అర్వింద్ కాషాయం కప్పుకున్న కసాయి, బొట్టు పెట్టుకున్న భూతం అని ఆ పార్టీకి చెందిన నేత మీసాల శ్రీనివాస్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా బీజేపీ తరపున పోటీ చేయడానికి అర్వింద్ పనికిరారని విమర్శించారు. అర్వింద్‌కు కాకుండా డేరాబాబా, స్వామి నిత్యానందకు టికెట్ ఇచ్చినా.. తాము వ్యతిరేకించకుండా ఉండేవాళ్లమన్నారు. బీజేపీ అధిష్ఠానం వెంటనే అర్వింద్‌ను ఎంపీ అభ్యర్థిగా తప్పించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని 15 లక్షల మంది ఓటర్లు కూడా అర్వింద్ అభ్యర్థిత్వంపై వ్యతిరేకతతో ఉన్నారన్నారు. మంగళవారం, తెలంగాణ భవన్‌లో తన భార్య, నిజామాబాద్ మున్సిపాలిటీ డివిజన్ కార్పొరేటర్ మీసాల సవితతో మీడియా సమావేశంలో పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ.. అర్వింద్ ప్రజల పట్ల చులకన భావంతో ఉంటారని, అహంకారి, దుర్మార్గుడు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ చరిత్రలో అర్వింద్‌లా అహంభావం కలిగిన వ్యక్తి ఇతర పార్టీల అభ్యర్థిగా ఎవరూ ఉండరన్నారు. అర్వింద్‌కు టికెట్ ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికలలో ఆయన తండ్రి ధర్మపురి శ్రీనివాస్ వల్లే గెలిచానని అర్వింద్ చెప్పినట్లు గుర్తుచేశారు. దమ్ముంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవాలని అర్వింద్‌కు శ్రీనివాస్ సవాల్ విసిరారు.

ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూడాలి

● స్థాయీ సంఘ సమావేశంలో జడ్పీ చైర్మన్



జడ్పీలో సమీక్ష నిర్వహిస్తున్న చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్

ఖిల్లా, మార్చి 5: ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందే విధంగా కృషి చేయాలని, ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సంబంధిత అధికారులకు ఆదేశించారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశమందిరంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామీణాభివృద్ధి అనుబంధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పలు శాఖల పనుల ప్రగతిపై సంబంధిత శాఖాధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సభ్యులు మాన్సింగ్, నారోజిగంగారం, సుమలత, కో ఆప్షన్ సభ్యులు మోయిజ్, జడ్పీ సీఈవో ఉషా, ఆయా శాఖాల అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు ఏసీపీల నియామకం

ఖిల్లా, మార్చి 5: జిల్లా ఎస్‌బీ ఏసీపీగా సుందరగిరి శ్రీనివాస్‌రావ్‌ను నియమించారు. హైదరాబాద్‌లో పని చేస్తున్న ఆయనను డీజీపీ రవి గుప్త ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. సీసీఎస్ ఏసీపీగా సాయిని శ్రీనివాస్‌ను నియమించారు. సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న విజయసారథిని హైదరాబాద్ సిట్ ఏసీపీగా బదిలీ చేశారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డిబార్

నిజామాబాద్‌అర్బన్, మార్చి 5: జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంగళవారం ఓ విద్యార్థి మాస్‌కాపియింగ్‌కు పాల్పడగా అతన్ని డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 57పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన గణితం-ఎ, బాటనీ,సివిక్స్ పేపర్-2పరీక్షకు మొత్తం 17,082 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 16,572మంది హాజరుకాగా 510మంది గైర్హాజరు అయ్యారు. నగరంలోని హరిచరణ్ హింది జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థిపై మాస్‌కాపియింగ్ కేసునమోదు అయింది. డీఈసీ కమిటీ7, హెచ్‌పీసీ కమిటీ 8, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 31, డీఐఈవో రఘురాజ్ ఆరుపరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

నగర బీజేపీ కార్పొరేటర్ సస్పెన్షన్

పెద్దబజార్, మార్చి 5: నగరంలోని 19వ డివిజన్ కార్పొరేటర్ మీసాల సవితను సస్పెండ్ చేస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి మంగళవారం నోటీసులను జారీ చేశారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘించి వ్యతిరేకంగా కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సస్పెన్షన్ తక్షణమే అమలుల్లోకి వస్తుందని తెలిపారు. వారం రోజుల్లో లోపు వివరణ ఇవ్వాలని కోరారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న తాహెర్‌బిన్‌హందాన్

నిజామాబాద్‌అర్బన్, మార్చి 5: జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హందాన్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా మంగళవారం హైదరాబాద్‌లోని హజ్‌హౌజ్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కోత్వాల్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లాహుస్సెన్‌ల సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆర్కెల నర్సరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, నరాల రత్నాకర్, ముత్యాల సునీల్‌రెడ్డి, పొద్దుటూరి వినయ్‌రెడ్డి, ఖుద్దూర్, అఖిల్ అహ్మద్, సాబెర్‌ఆలీ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డిలో నిర్వహించిన ప్రధాని మోదీ సభలో పాల్గొన్న జిల్లాకు చెందిన బీజేపీ నేత లక్ష్మినర్సయ్య

ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలి

పెద్దబజార్, మార్చి 5: నగర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలోని 50వ డివిజన్‌లో గల నల్లహన్మాన్ దేవాలయంలో మంగళవారం రెడ్డికా సంఘం ఆధ్వర్యంలో ప్రతినెల మంగళవారం నిర్వహించే సత్యనారయణ స్వామి వ్రతాలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి దైవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలందరు సుఖశాంతులతో అష్టఐశ్వార్యలతో ఆరోగ్యంగా ఉండాలని ఆశించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రకాష్, సుధాకర్, రమేష్, నర్సింగ్, నర్సయ్య, స్థానిక కార్పోరేటర్ రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి చేయూత

వర్ని, మార్చి 5: మండలం జలాల్‌పూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం వర్ని రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న సింగంపల్లి సురేందర్ తన ఉదారతను చాటుకున్నారు. మంగళవారం పాఠశాలకు అవసరమైన సీసీ కెమెరాలను అందజేసి గేట్లను మరమ్మతు చేయించారు. పాఠశాల అభివృద్ధికి చేయూత అందించిన సురేందర్‌ను ప్రధానోపాధ్యాయులు రత్నకర్, మాజీ ఎంపీటీసీ సాయగౌడ్, నరేడ్ల గోవర్ధన్, వీరప్ప, రామకృష్ణలు అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

మోస్రా, మార్చి 5: మండలంలోని గోవూరు, చింతకుంట గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. సుమారు 116మందికి పరీక్ష అట్టలు, జామెంట్రీ బాక్స్‌లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు శ్యామ్ గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

మోస్రా, మార్చి 5: మండలంలోని చే సెంబర్ తండాలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన పిల్లలకు మాత్రలు, టానిక్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైసానుల్లా, ఫార్మసిస్ట్ సుమలత, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆయా తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

నవీపేట, మార్చి 5: ఇటీవల నూతనంగా ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియామకమైన తాహెర్ బిన్ హందాన్ మంగళవారం బాధ్యతలు తీసుకోగా ఆయనను మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు హైదరాబాద్ నాంపల్లిలోని హజ్ హౌస్‌లో ఆయనను కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు. తాహెర్ బిన్ హందాన్‌ను సన్మానించిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, ఎస్‌కే.బాబు, కిరణ్ కుమార్, ఈశ్వర్ రెడ్డి, తదితరులున్నారు.

సిరికొండ : రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సిరికొండ వాస్తవ్యులు తాహెర్‌బిన్‌హందాన్‌ను సిరికొండ మండల కాంగ్రెస్ నాయకులు అభినందించారు. పూలబొకేలు ఇచ్చి శాలువలతో సన్మానించారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గొల్ల ఎర్రన్న, కాంగ్రెస్ మండల అధక్షులు బాకారం రవి, మల్లేష్ యాదవ్, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, బండారి నరేష్, రాజేందర్‌గౌడ్ తదితరులుఉన్నారు.

కోటగిరిలో ఓ ఇంట్లో చోరీ

కోటగిరి, మార్చి 5: మండల కేంద్రంలోని శివయ్య అనే వ్యక్తి చోరీ జరిగినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. శివయ్య ఆర్మూర్‌లో మూడు నెలల నుంచి నివాసం ఉంటున్నాడు. తాళం వేసిన ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి సుమారు ఆరు తులాల వెండి ఉంగరాలు, 12తులాల వెండి పట్టగొలుసులు చోరీకి గురైనట్లు ఎస్సై తెలిపారు. పక్కింటికి చెందిన రాములు, గజేందర్‌ల ఇళ్లలోనూ తాళాలు పగులగొట్టారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలల హక్కులను కాపాడాలి

సిరికొండ, మార్చి 5 : ప్రభుత్వం బాలలకు కల్పించిన హక్కులను కాపాడాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.కె రసూల్ బీ కోరారు. సిరికొండ రైతు వేదికలో జరిగిన సమావేశంలో రసూల్ బీ మాట్లాడారు. పిల్లల హక్కులపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి అనుగునంగా భారత ప్రభుత్వం హక్కులను ప్రతిపాదించిందన్నారు. ఆరోగ్యం, అభివృద్ధి పోషణ బతకడానికి అవసరమైనవి అత్యధికంగా పొందగలిగే ప్రమాణాలపై హక్కు వుందన్నారు. సామాజిక భద్రత అన్నిరకాల దోపిడి అశ్రద్ధ నుంచి విముక్తి కల్పించడం లాంటి హక్కులు బాలలకు కల్పించారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీడీవో లక్ష్మిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైర్లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,000	రూ.60,000	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-2 : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (10.05)
: చారి 111 (1.35, 10.10)
: వ్యూహం (4.25)
: భూతద్దం భాస్కర్ నారాయణ (7.10)
స్క్రీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10)
స్క్రీన్-4 : ఇంటి నెంబర్-13 (1.05)
: కిక్ (3.50)
: ఆర్టికల్ 370 (హిందీ) (7.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1: వ్యూహం (10.55)
: ఊరుపేరు భైరవకోన (1.30)
: సమరసింహారెడ్డి (4.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (7.30, 10.30)
స్క్రీన్-2: చారి 111 (11.00)
: హనుమాన్ (1.30, 4.30)
: వ్యూహం (7.30)
: కిక్ (10.30)
స్క్రీన్-3: మా ఊరి రాజారెడ్డి (10.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (1.30)
: భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20)
: ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ :
సమరసింహారెడ్డి (11.00, 9.15)
: కిక్ (2.15, 6.15)
నటరాజ్ : ఇంటి నెంబర్-13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్